

# కొడుకు నేర్పిన పాఠం

వెంకట్రామయ్య పట్నంలో కొడుకింటికొచ్చి అప్పటికే మూడు రోజులు దాటింది. వ్యవసాయ పనిముట్లు బజారుకెళ్లి కొనుక్కొచ్చాడు. ఆప్కో షోరూంకెళ్లి మూడు జతల దోవతులు తీసుకున్నాడు. చెప్పులు మాత్రం ఇంకా తన పల్లెలో

లస్మయ్య చేసినవే వాడతాడు కనుక అవి కొన్లేదు. ఓ సాయంత్రం అందంగా అలంకరించిన బజార్లన్నీ తిరిగాడు.

ఇన్ని పనులు చేసుకుంటున్నా... మనసులో ఏదో లాగుతోంది.

ఏంటది??

తన కొడుకు కుటుంబంలో ఏవో కనిపిస్తున్నాయి.... ఏమిటవి? పల్లెలో తన కుటుంబంతో చూస్తే, పట్నంలో తన కొడుకు కుటుంబంలో కన్పిస్తోన్న మార్పులు....

అవునూ... అవి మార్పులేనా?

లేక తన కొడుకు చేతగానితనానికి నిదర్శనాలా?

వెంకట్రామయ్యలో కొడుకుపట్ల జాలి పెరిగిపోయింది. ఆ రోజు ఉదయమే తాను నిద్రలేచేసరికి తన కొడుకు ప్రశాంత్ ఆరేళ్ల బాబుకి బాత్‌రూంలో తలంటు స్నానం చేయిస్తున్నాడు. కోడలుండగా వీడు స్నానం చేయించడమేమిటని వెంకట్రామయ్య ఆశ్చర్యంతో బెడ్‌రూం వైపు చూడగానే కోడలు శ్రీలక్ష్మి బెడ్‌పై పడుకుని ఏదో సీరియస్‌గా చదువుతోంది.

వెంకట్రామయ్య నివ్వెరబోయాడు. బాత్‌రూంలో బాబు చేస్తున్న అల్లరికి, నవ్వులకి ప్రశాంత్ శృతి కలుపుతున్నాడు. వరండాలోకి అబ్బాయిని తీసుకొచ్చి టవల్‌తో తుడిచి, ఒళ్లంతా పౌడర్ రాసి, తల దువ్వి స్కూల్ డ్రెస్ వేసి టై కట్టి షూస్ తొడిగాడు.

వెంకట్రామయ్యకి కొడుకు చేస్తున్న పని ఏమీ నచ్చలేదు.

"ఏమిట్రా... శ్రీలక్ష్మికి ఒంట్లో బాగా లేదా?" అన్నాడు.

"లేదు నాన్నా, తను బాగానే ఉంది" చెప్పాడు ప్రశాంత్.

"మరి బాబుకి నువ్వు స్నానం చేయించావేంటి?" అన్నాడు కొంచెం కోపంగా.

అందుకు ప్రశాంత్ నవ్వి "శ్రీలక్ష్మికి ఇప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 రాత పరీక్షలున్నాయి. అందుకు తాను చదువుకుంటాననటే..." అన్నాడు తండ్రి అంతరంగం అర్థమై.

"స్నానం చేయించాక చదువుకోవచ్చుగా...." అన్నాడు వెంకట్రామయ్య గుర్రుగా.

ప్రశాంత్ నవ్వుతూనే, "అలాగనీ కాకపోయినా వాడికి స్నానం చేయించడమంటే నాకిష్టం నాన్నా. ఎందుకంటే స్నానం చేయించేటప్పుడు వాడి చిలిపి చేష్టలు నాకిష్టం. వాడి శరీరాన్ని తాకుతుంటే నాకో వింత అనుభూతి. వాడి స్పర్శ, వెచ్చదనం నాకు నచ్చుతుంది. నేను పెట్టే చక్కిలిగింతలకు వాడు తెరలు తెరలుగా నవ్వుతుంటే నా మనసు జలపాతమే అవుతుంది. నాన్నంటే భయంకాదు.... నాన్నంటే ఆత్మీయుడు అనే భావం వాడిలో పూర్తిగా నిండిపోయింది."

"అందుకు స్నానం చేయించడం, దొడ్డికి కడగడంలాంటి పనులే చేయాలా? పిల్లల్ని అతిగారాబం చేస్తే చెడిపోతారు. సంసారమన్నప్పుడు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటే చూసే వాళ్ళకైనా బాగుంటుంది."

తండ్రిలోని ఆధిపత్యభావానికి ప్రశాంత్ మనసు రాజీపడలేదు. తన

తండ్రిలో నిర్దేశత్వం, నియంత్రణ, ఆధిపత్యం అన్నీ కలిసిన కమాండర్‌లా కనిపించాడు.

ఇలాంటి కట్టుబాట్లతోనే తన చిన్నప్పుడు ఇంట్లో అమ్మ బతుకొక భయంగా సంసారాన్ని ఈడ్చుకురావడం ఇంకా గుర్తుంది. ఈ ప్రవర్తనే తన అన్నయ్యలో విధ్వంసక ప్రవృత్తిని రగుల్కొలిపి ఇంట్లోంచి పారిపోయిన ఘటనలు కూడా ప్రశాంత్ మనసులో ఉవ్వెత్తున లేచిపడ్డాయి. అమ్మకీ, నాన్నకీ స్పష్టమైన తేడాని చూసిన బాల్యమంతా కదిలిపోయింది.

అయినా అవేవీ కనిపించనీయకుండా వంటింట్లోకెళ్లి పాలసీసాని వేడినీళ్లతో కడిగి అందులో పాలుపోశాడు. బెడ్‌రూంలో అప్పుడే లేచి ఆడుకుంటున్న ఏడాదిన్నర పాపని తీసుకెళ్లి సోఫాలో పడుకోబెట్టాడు.

పాప బోసినవ్వులు నవ్వుతుంటే... "చూడు నాన్నా! నిన్నీ వాళ్లమ్మకన్నా నన్ను చూస్తేనే ఎక్కువ కేరింతలు పెడుతుంది." అంటూ పాలసీసాని నోట్లోపెట్టి పాప నవ్వుల్తో కోరస్ కలిపాడు.

మొదటిసారి వెంకట్రామయ్యకి కొడుకులో అమ్మతనంలో కనిపించే లాలిత్యం, సున్నితత్వం కనిపించాయి. అయినా అది జీర్ణం కావడంలేదు. పాప గుక్కతప్పి పొలమారడంతో వెంటనే భుజాన వేసుకొని వీపు నిమురుతూ ఆడించాడు. అది నిముషంలో ఏడుపు మానేసింది.

వెంకట్రామయ్యకి ఇంకా బెడ్‌రూంలోంచి బయటకు రాని కోడలిమీద కోపం పెరుగుతోంది.

అయినప్పటికీ ఒకనాడు పెద్దోడు రెండేళ్లవయసులో ఉన్నప్పుడు రాత్రంతా ఏదో నొప్పితో ఏడుస్తుంటే తన భార్య సరస్వతి కళ్లలో నీళ్లు.... "ఎక్కడ ఏం బాధ కలుగుతుందో చెప్పడానికి నోరు లేని పసికూన" అంటూ తెల్లారేవరకూ భుజమ్మీమ్మదేసుకుని లాలిస్తూనే ఉంది. గంటల తరబడి వాడి ఏడుపుకు చిరాకేసి తాను పెరట్లోకెళ్లి మంచం వేసుకుని పడుకున్న జ్ఞాపకం వెంకట్రామయ్య గుండె పొరల్లోంచి చీల్చుకొచ్చింది.

ఏదో అనబోయిన వాడల్లా ఏమీ అన్లేకపోయాడు.

అప్పుడే బెడ్‌రూంలోంచి వచ్చి శ్రీలక్ష్మి పాపని తీసుకుంది. "పాపకి నువ్వు పాలు పూర్తిగా పట్టేయ్. ఈలోగా నేను కూరగాయలు తరుగుతాను. వంట త్వరగా చేద్దువుగాని..." అంటూ ప్రశాంత్ వంటింట్లో జొరబడ్డాడు.

శ్రీలక్ష్మి పాపని తీసుకుని బెడ్‌రూంలోకి వెళ్లింది. సోఫాలో పేపర్ చదువుతున్నట్లు కూచున్న వెంకట్రామయ్య కిచెన్‌లో ప్రశాంత్ బెండకాయలు, ఉల్లిపాయలు చకచకా కూనిరాగాలు తీస్తూ తరగడం కనిపిస్తోంది.

వాడు వంటగదిలో ఆ పనిని ఎంత ఇష్టంగా చేస్తున్నాడు.? వీడు ఆడంగి వెధవైపోయాడా? లేక జీవనశైలి మారుతోందా?? ఒకనాడు ఏదో పనిమీద తాను చిరాగ్గా ఉండి భోజనం ముందు కూచుంటే పప్పులోకి పచ్చి పులుసు వండలేదని తినే పళ్లాన్ని సరస్వతి వైపు విసిరి తన్నిన ఇరవైరెండేళ్ల కిందటి జ్ఞాపకాల శకలాలు మనసు పొరల్లోంచి ఫెళఫెళా రాలిపడ్డాయి.

తన్నితే గాల్లోకి ఎగిరిన పళ్లెం అంచు భార్య నుదుట తాకి రక్తం బొట్లుబొట్లుగా కారినా భయపడుతూనే నిల్చున్న ఆమె వదనం మరోసారి

కదలాడింది.

తనూ ఓ భర్తే! తనూ ఓ తండ్రే! తను ఇంట్లో అడుగుపెడితే పిల్లలంతా బెంబేలెత్తి గప్‌చుప్ అయ్యేవాళ్లు. కాని వీడు ఇంట్లోకి రాగానే అప్పటివరకు విశ్శబ్దంగా చదువుకుంటున్న పిల్లాడు హే అని అరుస్తూ అల్లరి చేస్తూ చుట్టుముడతాడు.

తన మాట గుమ్మంలో వినపడితే చాలు, తలుపు చాటున నిల్చుండే 'వడ్డించమంటారా?' అనే భార్యకి 'ఊఁ' అని హుంకరించడమే సమాధానమైతే, వీడు రాగానే 'ఈరోజు హోటల్నొంచే క్యారియర్' అంటూ చెప్పే కోడలు - సాంప్రదాయక పాత్రల్నించి ఈ తరం తల్లిదండ్రులు తప్పుకుంటున్నారా? అసలేమిటీ మార్పు?? ఇది వీడి వ్యక్తిగతమైన సంస్కారమా? ఇది సామాజిక మార్పా.??

వెంకట్రామయ్యకి రెండు తరాల మధ్య పెరిగిన అంతరం స్పష్టంగా కనిపిస్తున్నా అది అయోమయంలో పడేస్తోంది.

తన కూతురింటికి వెళ్లినప్పుడు తన అల్లుడు కూడా ఇలాగే ప్రవర్తించాడు.

పురషస్వామ్యంలోనే ఈ మార్పు వస్తోందా? ఇంటి పనులు చేస్తుంటే... వీళ్ల కళ్లలో ఎన్ని ఆనందాలు?? కొంచెమైనా వీళ్ల ముఖాల్లో 'చిన్నతనం' కనిపించడం లేదేంటీ?

మగాడంటే భర్త, సంరక్షకుడు, సంపాదనాపరుడు, విలాసవంతుడు, మగమహారాజు అనే అవతారాల్లో చిక్కుకుపోయిన తాము ఈ ఆనందాన్ని కోల్పోయామా?

తమ కాలంలో ఆడవాళ్ళు నిరసన ధ్వనితో ఎప్పుడూ అనే మాట గుర్తొచ్చింది 'తెస్తే వండిపెడతాం.... ఛస్తే ముండమోస్తాం' అని. అది భార్యాభర్తల మధ్య పేరుకుపోయిన అగాధం లోంచి పుట్టిన వాక్యమై ఉంటుంది.

వెంకట్రామయ్యలో చిత్రమైన సంఘర్షణ.

అది తుఫానై మనసునీ, శరీరాన్ని చుట్టేస్తోంది. ఈలోగా శ్రీలక్ష్మి వంటగదిలో దూరి వంట చేస్తుంటే ప్రశాంత్ ట్యూషన్ చెబుతున్నట్లు పుస్తకంలో విషయాలేవో భార్యకి బోధిస్తున్నాడు.

తర్వాత మాసిన బట్టలన్నీ వాషింగ్ మిషన్‌లో పడేసి బాత్‌రూంలో దూరాడు ప్రశాంత్. అరగంటలో శ్రీలక్ష్మి వంట పూర్తిచేసి, డైనింగ్ టేబిల్‌పై గబగబా సర్దింది. ప్రశాంత్‌కి క్యారియర్ పెట్టింది. తనూ స్నానం చేసి ఆఫీస్‌కి రెడీ అయింది. ప్రశాంత్ డ్రెస్ చేసుకుని డైనింగ్ టేబుల్‌పై కూచున్నాడు.

వెంకట్రామయ్యకి కొడుకుని చూడగానే నవ్వొచ్చింది. ఇప్పటివరకు పెద్దముత్తయిదువలా ఇన్ని ఇంటిపనులు చేసిన వీడేనా పెద్ద బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసేది అనుకున్నాడు.

భోజనం చేస్తుండగానే...

"నేను పదకొండు గంటల బస్సుకెళ్తాన్రా ప్రశాంత్" అన్నాడు వెంకట్రామయ్య.

"మరో రెండురోజులు ఉండండి మామయ్యా" అంది శ్రీలక్ష్మి.

"అవున్నాన్నా..." అన్నాడు ప్రశాంత్.

"వద్దు... వ్యవసాయ పనులు చాలా ఉన్నాయి. వెళ్లక తప్పదు" అన్నాడు. భోజనాలయ్యాక ఆఫీస్‌కి బయల్దేరిన ప్రశాంత్‌తో "ఏమండీ, వచ్చేటప్పుడు 'కేర్‌ఫ్రీ' ప్యాకెట్ తీసుకురండి" అంది శ్రీలక్ష్మి.

"ఓకే డియర్... ఒకటి చాలా? రెండు తీసుకురానా?" నవ్వుతూ జోక్ చేశాడు ప్రశాంత్. ఆ మాటలు విన్న వెంకట్రామయ్య తలపక్కకి తిప్పుకున్నాడు.

నలభైరెండేళ్ల కింది జ్ఞాపకం కెరటంలా ఎగిసిపడి గుండెశిలని ఢీకొట్టి విరిగిపడింది. తన పెళ్లయిన మూడో నెలకి పట్నం వెళ్తున్నానంటే 'ఏమయ్యా...' అంటూ భయంభయంగా, సందిగ్ధంగా దగ్గరికొచ్చింది భార్య సరస్వతి.

వణుకుతున్న చేయి సాచి పిడికిలి విప్పి 'మీరెలాగూ పట్నం వెళ్తున్నారు కదా!' ఇది తీసుకెళ్లి ఇదే సైజులోని రెండు బ్రాలు పట్టుకురండి...' అంది అభ్యర్థనగా.

అవమానంతో ముఖం ఎర్రబడ్డ తను సరస్వతి చెంప చెళ్ళుమనిపించాడు. "సిగ్గూ శరం ఉండాలే. మగాణ్ణి నేను పట్నం వెళ్తూ ఇది పట్టుకెళ్లి ఇలాంటివి కొనుక్కురావాలా? షాపువాడి ముందు నా పరువేమైనా ఉంటుందా? మొగుడికి ఏ పనులు చెప్పాలో కూడా తెలీదు. పో లోపలికి...." అన్న సంఘటన కళ్లముందు కదలాడింది.

ఇలాంటివి ఎన్నెన్ని జరిగాయి!

కాని వీళ్లు.... నిజంగా అనురాగానికి వాకిళ్ళు....

బాధ్యతలెరిగిన భాగస్వాములు... పితృస్వామ్య వ్యవస్థకి సరికొత్త నిర్వచనం చెప్తున్న సహస్రాబ్ది ప్రతినిధులు.

వెంకట్రామయ్య కళ్లల్లో సన్నని తడి కదలాడింది.

జజజజ జజజజజ జజజజజ

పల్లెకు చేరిన వెంకట్రామయ్య ఇంట్లోకి రాగానే సరస్వతి ఎదురొచ్చి "కొడుకూ, కోడలూ, పిల్లలూ బావున్నారా?" అనడిగింది.

"బాగున్నారు" అంటూ ఓ ప్యాకెట్‌ని అందించాడు. వేన్నీళ్లు బాత్‌రూంలో పెట్టు అని ఆర్డరేయబోయి సరస్వతి మోకాళ్ల నొప్పుల్తో బాధపడుతున్న విషయం గుర్తొచ్చి తనే నీళ్లు కట్టెలపొయ్యిమీద వేడిచేసుకుని స్నానం చేసి హుషారుగా తిరిగొచ్చాడు.

భర్త తన పని తాను చేసుకోవడం వైవాహిక జీవితంలో మొదటిసారి కావడంతో విస్తుబోయింది.

"నీకేం తెచ్చానో చూశావా?" అన్నాడు.

"ఈ వయసులో ఏం తెస్తారులెండి... జండూబామ్ సీసాలు తప్ప...." అని పాకెట్ విప్పిన సరస్వతికి ఆనాటి చెంపదెబ్బ గుర్తొచ్చింది.

నవ్వాలో, ఏడవాలో అర్థంగాక బిక్కపోయి చూస్తుంటే ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. "కలిసి బతకడం కన్నా కలిసి జీవించడంలో ఉన్న ఆనందాన్ని కొడుకు, కోడలు చూపించారు సరస్వతీ! అందుకే ఆనాటి తప్పుని ఈనాడు సరిదిద్దుకున్నాను" అన్నాడు.

చిన్నపిల్లలా తెరలు తెరలుగా నవ్వింది సరస్వతి.

*